క్లుప్తంగా

విద్యుత్‌శాఖ ఈఈగా రాజశేఖరరెడ్డి బాధ్యతలు



రాజంపేట రూరల్: విద్యుత్ శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా ఎస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌రెడ్డికి అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్‌లు స్వాగతం పలికారు. మదనపల్లి ఈఈగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

టీడీపీ.. జనసేన కలిసినా ఒరిగేది శూన్యం

రామాపురం : ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసిన ఒరిగేది శూన్యమని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రాయచోటి నియోజకవర్గంలో శ్రీకాంత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు. నియోజవర్గంలోని ప్రజలందరూ ఆయన వెంట ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబును జైలుకు వెళ్లడం వైఎస్సార్‌సీపీ కుట్ర కాదని..అవినీతి చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదన్నారు.

అనుమతి తప్పనిసరి

ఓబులవారిపల్లె : గ్రామాలలో వినాయక విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు గ్రామాలలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠ కోసం అనుమతులు తీసుకున్నవారు బాధ్యత వహించాలని ఎక్కడా గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొవాలని అన్నారు. నిమజ్జనం నాడు ఎక్కడ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. అనుమతించిన ప్రదేశాలలో నిమజ్జనం నిర్వహించాలని సూచించారు.

ఆర్థికసాయం



బాలుడి చెక్కును అందిస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె: పుల్లంపేట మండలం పుత్తనవారిపల్లె గ్రామానికి చెందిన మోహన్ కుమారుడి వైద్యానికి ముక్కా రూపానందరెడ్డి రూ. 30 వేలు ఆర్థికసాయం అందించారు. మోహన్ కుమారుడు జెనిటిక్ సంబంధిత వ్యాధితో ఇబ్బందులు పడుతున్నాడు. వైద్యం ఖర్చులకు గాను ముక్కా రూపానందరెడ్డి స్పందించి తమ ఫౌండేషన్ ద్వారా ఈ చెక్కును అందజేశారు. సర్పంచ్ అరవ శ్రీధర్,సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు ఇప్పించండి



వ్యాధి నిరోధక టీకాలు పరిశీలిస్తున్న ఉషశ్రీ

ఓబులవారిపల్లె: పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. శనివారం ముక్కవారిపల్లి అంగన్ వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేయాలని సూచించారు. అంగన్ వాడీ సెంటర్‌లో రికార్డులు పరిశీలించి సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ రవీంద్రబాబు, ఆశా, అంగన్ వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

రామాపురం: లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో శనివారం బండపల్లె వద్ద గల ప్రేమాలయంలోని వృద్ధులకు దాత తిరుపతి వాస్తవ్యులు విశ్రాంత ఎస్‌బీఐ అధికారి వి.టీ.రమణ ఆర్థిక సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా పలు సేవా కార్యక్రమాలను చేపడుతామన్నారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్‌ఎస్ హరినాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి,ఆశ్రమం మేనేజర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి అవసరం

రాయచోటిటౌన్: ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని డీఈఓ శ్రీరాం పురుషోత్తం అన్నారు. శనివారం రాయచోటి నియోజక పరిధిలోని రాయచోటిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు చెందిన విద్యార్థులతో స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఈ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు కబడ్డీ, ఖో–ఖో, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలను ఆయన ప్రారంభించారు.జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతకుమారి, నియోజక వర్గ క్రీడా కోఆర్డినేటర్లు జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి, నరసనరాజు, హెచ్‌ఎం నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రైతు ముంగిటకే ప్రభుత్వ సేవలు

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



అర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథ రెడ్డి



లబ్ధిదారులకు నూతన పెన్షన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

చిన్నమండెం : వైఎస్సార్ సీపీప్రభుత్వం రైతు ముంగిటకే సేవలను తీసుకొచ్చిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం తిమ్మారెడ్డిగారిపల్లెలో జెడ్పీ మా జీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను రైతులకు అందించేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారన్నారు. దేవనాథరెడ్డి మాట్లాడారు. సర్పంచ్ నజీర్‌బాషా, మాజీ సర్పంచ్ అమ్మాజీ, లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ శ్యామ్‌చంద్ర, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, వైసీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, షఫీ, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

ప్రజల ఆరోగ్య సంరక్షణే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మల్లూరు కస్పాలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. ఈ నెల 15–30వ తేదీల వరకు వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా గృహాల్లో ఆరోగ్యసేవలు గురించి ఆరా తీసి అవి అవసరమైన వారిని గుర్తిస్తారన్నారు. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీల వరకు అన్ని సచివాలయాల పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి,సర్పంచ్ లక్ష్మీరెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మాజీ సర్పంచ్ బాచిరెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అంజనప్ప పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఆసరాగా నిలుస్తున్న సీఎం జగన్

అవ్వాతాతలకు సీఎం జగన్ ఆసరాగా నిలిచారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నమండెంలో జరిగిన నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీలో మాట్లాడారు. చిన్నమండెం మండలానికి 272 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. నూతన పెన్షన్లతో కలిసి ఒక చిన్నమండెం మండలంలోనే 5289 పెన్షన్లు పంపిణీ అవుతున్నాయన్నారు.

చరిత్రలో తొలిసారి ఆస్తి హక్కు పత్రాల జారీ

చరిత్రలో మొదటిసారిగా గ్రామాల్లో ఆస్తి హక్కు పత్రాలను జగన్ ప్రభుత్వం జారీ చేస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నమండెం మండలంలోని బోనమలకు చెందిన 228 మందికి యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాల పంపిణీ చేశారు. ఈ సర్వేతో భవిష్యత్‌లో భూవివాదాలు తగ్గుముఖం పడతాయన్నారు. సర్పంచ్ అఫ్రోజ్, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సీఎం జగన్

చిన్నమండెం : అర్హతే ఆధారంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడంలోనూ, అభివృద్ధి పనులలోనూ, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ సీఎం జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మల్లూరు గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కొత్తపేట, ఎగువగడ్డ దళితవాడ, దిగువగడ్డ దళితవాడ, మల్లూరు, కొడిదిపల్లె, గంగిరెడ్డిగారిపల్లి, తిమ్మారెడ్డిగారిపల్లి, బెల్లంవాండ్లపల్లె, దండోళ్లపల్లి, కురవపల్లెలలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటా తిరిగి పథకాల అమలును వివరిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యామ్‌చంద్ర, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగిస్తే కఠినచర్యలు

రాయచోటి అర్బన్: పెంపుడు జంతువులైన ఆవులు, పందులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలి ప్రజారోగ్యానికి ఇబ్బందిని కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలోని రోడ్లపై ఆవులు విచ్చలవిడిగా తిరగడం, రోడ్లపై పడుకోవడం, పాదాచారులను వెంబడించడం ఇబ్బందికరంగా తయారైందని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు తీరని అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆవుల యజమానులు వారం రోజుల లోపు తమ గోవులను ఇళ్ల వద్ద కట్టడిచేసుకోవాలన్నారు. లేకుంటే ఆవులను గోశాలకు తరలిస్తామన్నారు. పందులను కూడా వాటి ఊరిదూరంగా తరలించాలని వాటి యజమానులకు సూచించారు.

మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఓబులవారిపల్లె: బొమ్మవరం గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను సర్పంచ్ గంగురాజు, వైస్ ఎంపీపీ గూడురు గౌరిశంర్‌రాజు ప్రారంభించారు. అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు ఈ పోటీలను నిర్వహించారు. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాల క్రీడాకరులు పోటీలలో పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజకులను కించపరిస్తే సహించేదిలేదు

రాయచోటి అర్బన్ : కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని అన్నమయ్యజిల్లా రజకసేవా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు టి.రమేష్‌బాబు, వి.శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బెంగళూరు నగరానికి చెందిన ఒక మహిళా నాయకురాలు రజకులను కించపరుస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి సదరు మహిళలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

రాయచోటి అర్బన్ : మట్టి వినాయకుడి బొమ్మలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని మానవతసంస్థ రాయచోటి ఛైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాల ఆవరణంలో చిన్న వినాయక విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందచేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రకృతిసిద్ధంగా లభించే మట్టితో తయారుచేసే విగ్రహాలను పూజించడం శుభసూచకం అన్నారు. మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సంబేపల్లి: మండల పరిధిలోని శెట్టిపల్లె కస్పాలో నాబార్డ్ సౌజన్యంతో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శెట్టిపల్లి బ్రాంచ్‌లో అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత ద్వారా ప్రజలకు బ్యాంకులో ఉండే జీవన జ్యోతి భీమా, సురక్ష భీమా యోజన పథకం, అటల్ పెన్షన్ పథకం గురించి మాటల రూపకంగా మ్యాజిక్ షో రూపంలో వివరించారు. బ్యాంక్ మేనేజర్ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ముస్తాబైన వినాయక మండపం

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లిలో వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు మండపాన్ని ముస్తాబు చేశారు. బస్టాండ్ నుంచి వినాయక మండపం వరకు ఇరువైపులా విద్యుత్ లైట్లు వేసి వినాయకుని ప్రతిమను విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఐదురోజులపాటు వినాయక ఉత్సవంలో వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు లెపపారు. అన్నదాన కార్యక్రమంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ప్రతిరోజూ వేదపండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



పింఛన్ మంజూరు పత్రంతో పాటు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పుల్లంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి అని, ప్రజల సమస్యలు తీర్చేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వత్తలూరు పంచాయతీలోని దేవసముద్రం, వడ్డిపల్లి గ్రామాలలో ఉపసర్పంచ్ ఎం శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడినందుకు జైలు పాలయ్యారన్నారు. తప్పుచేస్తే ఎంతటివారైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. 2024లో తెలుగుదేశం, జనసేన పోటీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా అందరికీ తోడూ, నీడగా నిలిచిన జగన్ మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.మండల కన్వీనర్ ముస్తాక్, మండల జేసీఎస్ కన్వీనర్ ఎస్ హరినాథ్ రెడ్డి, జెడ్పీటీసీ రామనాథం, విజయకుమార్ రెడ్డి, వెంకటరెడ్డి, తల్లెం సుధీర్ రెడ్డి, తల్లెం పాపిరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, మల్లికార్జున రెడ్డి, తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రైల్వేకోడూరు అర్బన్: పేద ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉండడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని శనివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆరోగ్యమేళా ఆయుష్మాన్‌భవ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిని తనిఖీచేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, రమేష్, శివయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



లే అవుట్‌లో రోడ్డుసైడ్ డ్రైన్‌ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

రాయచోటి అర్బన్ : దిగువ అబ్బవరంలోని ఎంఐజీ లేఅవుట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ పాలకవర్గం, అధికారులు శనివారం సాయంత్రం పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్ తదితరులు ఎంఐజీ లేఔట్‌లో చేపడుతున్న వాటర్‌ట్యాంక్ నిర్మాణం, బిటిరోడ్,డ్రైన్‌ల పనులను పరిశీలించారు. పట్టణానికి సమీపంలో ప్రశాంత వాతావరణంలో అన్ని సదుపాయాలతో, ప్రభుత్వ అనుమతులతో, అతి తక్కువ ధరలతో ప్లాట్లు మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి రావడం ప్రజలకు వరం అన్నారు. ప్రజల కోరిక, డిమాండ్ మేరకు ప్రస్తుత ఎంఐజీ లేఅవుట్‌ను ఆనుకుని మరో 20 ఎకరాలలో అన్ని హంగులతో మరో లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ప్లాట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ నేతలు సుగవాసి శ్యామ్, ఫయాజ్ అహమ్మద్, జానం రవీంద్ర, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, పబ్లిక్‌హెల్త్ ఏఈ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైజూస్ ట్యాబ్‌ల వినియోగంతో నాణ్యమైన విద్య



ట్యాబ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా బైజూస్ అధికారి చిట్లూరి సుధాకర్

లక్కిరెడ్డిపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వినియోగం వల్ల నాణ్యమైన విద్య సమకూరుతుందని, విద్యా ప్రమాణాలు పెంపొందుతాయని అన్నమయ్య జిల్లా బైజూస్ నోడల్ అధికారి చిట్లూరి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన ట్యాబ్‌లను ఆయన పరిశీలించారు. వీటిపై విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ట్యాబ్‌లు మరమ్మతులకు గురైతే వాటిని సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు ఇవ్వాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు పరిష్కారాలు తెలిపి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎంఈఓ చక్రేనాయక్, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి రాధ, స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చలకు సిద్ధం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే అర్హత, స్థాయి జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్రకు లేదని శనివారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, తొండం రాజేంద్ర, నందాబాలా, శ్రీరామ్ వినోద్ తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఎంత అభివృద్ధి చేశారో జనసేన నాయకులు కళ్లు పెట్టుకుని చూడాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 1200 కోట్ల రుపాయలతో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సంక్షేమ, అభివృద్ధి పనులు చేశారన్నారు. నియోజకవర్గంలో పూర్తయిన రోడ్లు, వాటర్‌ట్యాంకులు, బ్రిడ్జిలు, బీటీరోడ్లు, సీసీ రోడ్లు, భవనాలు , అభివృద్ధి చెందిన పాఠశాలలు, ఇంటింటికి వెళుతున్న సంక్షేమ పథకాలు జనసేన నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు. జనసేన నేత తాతంశెట్టి నాగేంద్ర బ్రోకర్ పనులు చేసేవారిలా మాట్లాడుతున్నారని వారు తెలిపారు. అభివృద్ధి ఎంత జరిగిందో చెప్పడానికి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కులం ముసుగులో రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. మావిళ్ల సుబ్రమణ్యం, సుబ్బయ్య , శివయ్య, వైఎస్ కరీముల్లా, దొంతిరెడ్డి రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

–ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి



ఆరోగ్య సురక్ష అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకెళుతున్నారని.. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ చాంబరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై వైద్యసిబ్బంది, సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ సౌభాగ్య, మండలవైద్యాధికారిణి స్పజన, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనరు కలీంఖాన్, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబుసూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, హిమగిరియాదవ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టుమిషన్‌లు అందిస్తున్న సుకుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన 30 మందికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన నిరుద్యోగ మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అభిషేక్ రెడ్డికి ఘన సత్కారం



చిట్వేలిలో అభిషేక్ రెడ్డి ఉత్సవ ర్యాలీ దృశ్యం

చిట్వేలి: లెఫ్టినెంట్‌గా ఎన్నికైన ముద్దా అభిషేక్ రెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా శనివారం చిట్వేలిలో పలు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అభిషేక్ రెడ్డి మండలవాసి కావడం గర్వకారణమన్నారు. అందుకే ఆయనపట్ల మనకున్న గౌరవాన్ని చాటుకునేందుకు ఆయనను ఊరేగిస్తూ ర్యాలీ నిర్వహించామన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ సభ్యులు, మానవతా సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఓజోన్ పొర చిత్రంను ప్రదర్శిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జేవీవీసభ్యులు



సంబేపల్లెలో విద్యార్థులు గొడుగులు ధరించి ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

చిట్వేలి: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రిటైర్డ్ డీఐజీ మునిస్వామి పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా శనివారం చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ పద్మావతి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సీహెచ్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడారు. శివనాగేశ్వరరావు, నరసింహులు, శివారెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ కోసం..

రాయచోటి: ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ప్రయత్నిద్దామని అన్నమయ్య జిల్లా జూనియర్ సివిల్ జడ్జి కె శారద పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డైట్, రాయచోటిలో విద్యార్థులకు, న్యాయ సలహాలు కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలా దేవీ పాల్గొన్నారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పచ్చని చెట్లను మనం కాపాడితేనే..

రాయచోటిటౌన్ : పచ్చని చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి అన్నారు. శనివారం రైతు బజార్ వద్ద వృక్షరక్షణ సమితి అధ్యక్షులు తులశీశ్వరెడ్డి మొక్కలు పంపిణీ చేశారు. వీఆర్‌రెడ్డి, మానవత సంస్థ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి (బాబు), మానవత మహబూబ్ బాషా పాల్గొన్నారు.

సిద్దవటం: మన జీవ ప్రపంచ వారసత్వాన్ని భవిషత్ తరాలకు అందించాలంటే ప్రకృతి సంరక్షణ ముఖ్యమని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. సిద్దవటంలోని జెడ్పీ స్కూల్‌లో ప్రపంచ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఓజోన్ జీవకోటికి రక్షణ కవచం

సంబేపల్లి: సూర్యుని నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమి మీదకు చేరకుండా ఓజోన్ పొర సమస్త జీవకోటికి రక్షణ కవచంగా ఉందని ప్రధానోపాధ్యాయులు నరసింహా రెడ్డి అన్నా రు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి ఓజోన్ పొరను రక్షిద్దాం, భూమిని కాపాడుకుందాం అంటూ ఓజోన్ పొర ప్రాధాన్యత గురించి నినాదాలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, చంద్రశేఖర్, పూజారి రామయ్య, నబీ సాహెబ్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరిబాధ్యత

రాయచోటి అర్బన్ : ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని కొత్తపేట రామాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఓజోన్ ప్రాముఖ్యతపై డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

లక్కిరెడ్డిపల్లి: ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవంను పురస్కరించుకొని శనివారం ఏపీ మోడల్ స్కూల్‌లో ఓజోన్ పొర ట్రై ఆక్సిజన్‌పై ర్యాలీ నిర్వహించారు.

అక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదు: ఆకేపాటి



ఓబిలి గంగిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్మన్ అమర్నాథరెడ్డి

ఓబులవారిపల్లె: అక్రమాలకు పాల్పడ్డ వారు ఎంతటి వారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్ట్ అయ్యారన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు అనేక ఆరోపణలు ఉన్నాయని, వాటిని విచారించిన అనంతరం సాక్ష్యాధారాలతో అరెస్టు చేశారన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి నివాళి

ఓబులవారిపల్లె: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓబిలి గంగిరెడ్డి(87) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మృతుని కుమారులు మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గంగిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాష్ట్ర నాయకులు ముక్కా రూపానందరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరిటెండెంట్ ధరణీ కుమార్, అభివృద్ధి కమిటీ మెంబర్ భాస్కర్ తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధరణీ కుమార్ మాట్లాడుతూ ప్రతి శనివారం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక స్పెషాలిటీ వైద్యులచే వైద్యం అందించనున్నట్లు వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న పేదలకు ఈ పథకం ద్వారా రూ. 5 లక్షలు, ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్, గుండె జబ్బులు, కంటి, ముక్కు, చెవులు, గొంతు సమస్యలతో పాటు గర్భిణులకు ఆపరేషన్లు వంటి సేవలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్ఆర్ జీవన్, భరత్, సజ్జత్ రెడ్డి, కీర్తి, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.